


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



\- 124 –

## ఎడారి ఏడ్చింది

**"సుబ్బమ్మా..** ఇదిగో నీ టికెట్. రేపు సాయంత్రమే నీ ఫ్లయిటు. ఎల్లుండి ఉదయానికి నువ్వు మద్రాసు చేరుకుంటావు. బ్యాగులన్నీ సర్దుకున్నావా" ఆప్యాయంగా అడిగాడు హసన్.

బదులుగా హసన్ నుదుటిపై ముద్దు పెట్టి వెక్కివెక్కి ఏడ్చింది సుబ్బమ్మ.

"ఏడవకు సుబ్బమ్మా..నీకు ఏ అవసరం వచ్చినా నాకు ఫోన్ చెయ్యి.మేము కూడా నిన్ను చూసేందుకు ఇండియా వస్తాము." ఓదార్చాడు హసన్.

అలా అన్నాడే కానీ లోపల అతడికీ బెంగగానే వుంది. తల్లి జేనబ్ కని భూమ్మీద వేసి పురిటి జబ్బుతో అల్లా పిలిచాడంటూ వెళ్ళిపోయింది. వెంటనే తండ్రి మరో పెళ్ళి ఆ తరువాత ఇంకో పెళ్ళి కూడా చేసుకున్నాడు.

కళ్ళు తెరవని ఆ పసికందును గుండెకు హత్తుకుని సుబ్బమ్మే పెంచి పెద్ద చేసింది. కువైట్ తల్లులది డబ్బాపాల చరిత్రే. కానీ రెండేండ్ల చిన్నోడిని వదిలేసి వచ్చిన సుబ్బమ్మకు పాలు ఇంకా ఇంకిపోలేదు. ఏడ్చే హసన్ కు రొమ్ము నోట్లో పెట్టి సముదాయించేది.

"తల్లిపాలు తాగి పెరిగాము మాకు బుర్ర బాగా పనిచేస్తుంది. విశ్వాసం వుంటుంది. మీరు డబ్బాపాలు తాగినోళ్ళు మీకు బుర్రవుండదు" అని మన భారతీయులు అరబ్బులను ఎద్దేవా చేస్తుంటారు.

తల్లి ఎలా వుంటుందో హసన్ కు తెలియదు. ఫోటోల్లో చూడటం తప్ప. కానీ పసికందుగా ఉన్నప్పుడే సుబ్బమ్మ ఒడిలో చేరాడు కాబట్టి ఆమెనే అమ్మ అని అనుకున్నాడు. ఆమెతో అనుబంధం పెరగడంతో ఆమె పనిమనిషి అనే భావన అతడికి కానీ ఆ ఇంట్లో వున్నవారికి కానీ ఎప్పుడూ రాలేదు.

సుబ్బమ్మ ఇండియాలో ఇద్దరు బిడ్డల్ని వదిలేసి సంపాదన కోసం కువైట్ కు వచ్చింది. తల్లిని కోల్పోయిన హసన్ ను మూడోబిడ్డగా భావించి ఎంతో ప్రేమగా పెంచింది.

తండ్రి మరో పెళ్ళి చేసుకుని మరో ఇంటికి పోవడంతో బాల్యం, ఆటపాటలు అన్నీ సుబ్బమ్మ చుట్టూనే అల్లుకున్నాయి. కువైట్ షేకులు ధనవంతులు. హసన్ తండ్రికి ఐదారు ఇళ్ళు వుండేవి. బాబా ఆ ఇల్లు హసన్ కు వదిలేసి ఆ బిడ్డ బాధ్యతను సుబ్బమ్మకు అప్పగించాడు. బిడ్డను బాగా చూసుకోమని చెప్పి ఆమె జీతాన్ని పెంచాడు.

ఆయనకు వచ్చే ఆదాయంలో పదవ వంతు హసన్ కు వచ్చేలా ఏర్పాటు చేసాడు. ఇంట్లో వంటమనిషిని, పనిమనిషిని వుంచి నెలకొకసారి వచ్చి వారికి జీతాలు ఇచ్చి హసన్ తో కాసేపు ఆడుకుని వెళ్ళేవాడు. హసన్ పిన్ని, మామయ్యలు, బంధువులు కూడా అపుడపుడూ వచ్చి చూసి వెళ్ళేవారు. అంతే కాదు కువైట్ ప్రభుత్వం చిన్నబిడ్డల ఖర్చులకు ప్రతినెలా కాస్త ఫండ్ ఇస్తుంది. ప్రేమకు కొదవ వుండచ్చు కానీ డబ్బుకైతే కువైట్ లో కొదువలేదు.

అలా హసన్ సుబ్బమ్మ చేతుల్లో అల్లారుముద్దుగా పెరిగాడు. ఇప్పుడు హసన్ కు ముప్పై యేళ్ళు నిండాయి. పెళ్ళయి పిల్లలు కూడా పుట్టారు. అక్కడ ఇండియాలో ఆమె బిడ్డలు కూడా పెద్దవాళ్ళయి పెళ్ళి చేసుకున్నారు. మనవళ్ళు మనవరాళ్ళు పుట్టారు.

ఆమె అప్పుడప్పుడూ ఇండియాకు వెళ్ళి వచ్చినా ఆమె లోకమంతా ఇక్కడే వుండేది. ఆమె ప్రపంచం ఇదే అనిపించేది. లాలించి పెంచిన ప్రేమ కాబట్టి ప్రాణమంతా హసన్ మీదే పెట్టుకుని బతికింది. ఇప్పుడు ఆమె ముసలిదవడంతో ఆరోగ్యం సహకరించడం లేదు.

అయినా ఇక్కడే వుండమని హసన్ చెప్తున్నాడు. కానీ అక్కడ ఆమె పిల్లలు "ఇక చాలమ్మా.. ఎన్నిరోజులు పరాయి దేశంలో వుంటావు? ఆరోగ్యం బాలేదుకదా, వచ్చి ఇక్కడ ఆసుపత్రిలో చూపించుకో. ఇంట్లో కూర్చుని మనవళ్ళతో ఆడుకో.. పిల్లలు నానమ్మ కావాలి అని ఒహటే అడుగుతున్నారు" అని పదేపదే చెప్పడంతో ఇండియాకు వెళ్ళాలి అనే గట్టి నిర్ణయం తీసుకుంది.

పుట్టిన ఊరు అందులోని ఆ మట్టి ఆ నేలా.. రా రమ్మని పిలుస్తున్నాయి. చచ్చిపోతే ఆ మట్టిలోనే కలిసిపోవాలనేది తన కోరిక. కానీ హసన్ ను వదిలి వెళ్ళాలంటే మనసొప్పుకోవడం లేదు. దు:ఖం ఆగడం లేదు. వుండలేక వెళ్ళలేక ద్వైదీమానంతో ఆమె హృదయం తల్లడిల్లిపోతోంది. ఇప్పటికే ఎన్నోసార్లు వెళ్ళాలనుకుంటూ వాయిదాలు వేసుకుంటూ వచ్చింది. ఇక ఈసారి టికెట్ కూడా చేతిలోకి వచ్చింది. ఈ ప్రయాణం ఇక ఆగేది కాదు.

"నాయనా.. ఈ ముసలి ప్రాణం వుంటుందో, పోతుందో... ఇండియా వెళితే మరలా నిన్ను చూడగలనో లేదో" అంటూ కళ్ళొత్తుకుంది.

సోఫాలో దిగులుగా కూర్చున్న హసన్ కు కూడా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. హసన్ భార్య జులేఖా వచ్చి "బాధ పడకండి సుబ్బమ్మా. మీరు ఏడిస్తే హసన్ కూడా బాధ పడతాడు" అని ఓదార్చింది.

హసన్ పిల్లలు రత్నాల్లా వున్నారు. వాళ్ళు కూడా సుబ్బమ్మ కాళ్ళను చుట్టుకున్నారు. కన్నీళ్ళు తుడిచారు. మామూలుగా అయితే కువైట్ వాళ్ళు పనిమనుషులతో అనుబంధాన్ని పెంచుకోరు.

కానీ హసన్ ఆమె వద్ద తల్లి ప్రేమను పొందాడు కాబట్టి సుబ్బమ్మ అంటే ఇష్టంతో కూడిన గౌరవం. అటు చూస్తే కన్నపిల్లలు, ఇటు చూస్తే పెంచిన పిల్లాడు. హృదయం రెండు వ్రక్కలయిన భావన. శరీరం రెండు భాగాలయితే బాగుండు అనిపిస్తోంది. ఎంతోమంది పనిమనుషులుగా గల్ఫ్ కు వచ్చి దినారాలు సంపాదించి పిల్లల్ని పెంచారు.

కన్నబిడ్డలకంటే ఎక్కువగా కంటికి రెప్పలా చూసుకున్నారు. తిరిగి వదిలిపోయేటప్పుడు ఆ బాధ వర్ణనాతీతం. అది తల్లి మనసుకే తెలిసిన వేదనా గీతం.

ముప్పైయేళ్ళ కాలం గిర్రున తిరిగిపోయింది. ఈ మధ్యలో జీవితమంతా ఈ ఎడారి దేశంలోనే కరిగిపోయింది.

హసన్ బిడ్డలాగా చూసుకున్నాడు. డబ్బుకు లోటు రానివ్వలేదు. కావలిసినంత డబ్బును ఇండియాలో వున్న బిడ్డలకు పంపించుకోగలిగింది. అన్ని అవసరాలూ తీరాయి. ఇద్దరు కొడుకులూ చదువుకుని ప్రయోజకులయ్యారు. చెరో ఇల్లూ కట్టుకుని పెళ్ళి చేసుకుని పిల్లలతో స్థిరపడ్డారు. తన బాధ్యతలు తీరాయి. ఈ మధ్య ఆరోగ్యమే సన్నగిల్లింది. విశ్రాంతి అవసరం అన్నారు డాక్టర్లు. ఈ అవసాన దశలో పుట్టిన నేలపై గడిపితే బావుంటుంది అనేది కూడా ఒక కోరిక. కానీ హసన్ ను చూడకుండా వుండగలదా?

ముందు రెండేళ్ళకు ఒకసారి నెలరోజులు సెలవుపై వెళ్ళినా మనసంతా ఇక్కడే వుండేది. హసన్ ఎలా వున్నాడో అని బెంగ పడేది.

ఆ రాత్రి సుబ్బమ్మకు నిద్ర పట్టలేదు. సర్ది పెట్టిన బ్యాగులను చూసి కలవరపడింది. అర్ధరాత్రి మనసంతా ఆందోళన కమ్ముకోగా కిటికీ తెరిచి బయటికి చూసింది. తను పెంచిన తోట తీవెలతో పూలతో పచ్చగా వుంది. నిండుగా గెలలతో ఖర్జూరపు చెట్లు కాపుకు వచ్చాయి. ప్రతియేటా ఖర్జూరపు గెలలను తెంచి ఎండబెట్టి గంపలకు ఎత్తి సంవత్సరమంతా దాచి వుంచేది. రంజాన్ మాసంలో అరబ్బులు సూర్యాస్తమయంలో ఉపవాసం ముగించి ఇఫ్తార్ విందు స్వీకరించే ముందు మొదట ఖర్జూరాన్ని, మజ్జిగను తీసుకుంటారు. ఉపవాసంతో వడలిన శరీరానికి ఖర్జూరం తక్షణ శక్తిని ఇస్తుంది.

అరబ్బులు ఎడారి ఫలమయిన ఈ ఖర్జూరాన్ని ఆ అల్లా ప్రేమతో అనుగ్రహించిన కానుకగా భావిస్తారు

ఈసారి తను ఇక్కడ వుండదు. ఏనాటి ఋణమో ఎడారిలో ముప్పైయేళ్ళు గడిపింది. ఇక ఈరోజు ఇక్కడ ఆఖరిరోజు అనుకుంటూ ఏడ్చింది సుబ్బమ్మ. నవ్వులతోనూ ఏడ్పులతోనూ సంబంధంలేని కాలం గిర్రున తిరిగింది. తెల్లవారింది. నిద్రలేకుండా ఏడ్చిన కళ్ళు ఎర్రగా మారాయి. ఆమె కళ్ళే కాదు ఇటు హసన్ వి కూడా. ఆ రోజంతా హసన్ సుబ్బమ్మను వదల్లేదు. చంటి పిల్లాడిలా ఆమెను అంటిపెట్టుకునే వున్నాడు.

సుబ్బమ్మ హృదయం అరేబియా సముద్రంలా ఉవ్వెత్తున ఎగిసింది. ఎడారిలా మారి గాలి దుమారం లేచింది.

సమయం దగ్గర పడటంతో స్నానం చేసి తయారయింది. హసన్, భార్యాపిల్లలు సుబ్బమ్మతో కలిసి భోంచేసారు. బహుమతులన్నీ ఇచ్చారు. ఎన్నో జాగ్రత్తలు చెప్పారు. పనివాళ్ళు కూడా కన్నీళ్ళు పెట్టుకున్నారు.

హసన్ కువైటీ అయినా సుబ్బమ్మను తల్లిలా చూసుకున్నాడు. ఆ ఇంటితో ఆమె అనుబంధం అంతా ఇంతా కాదు.

కారెక్కుతూ చివరిసారిగా ఇంటివైపు చూసింది సుబ్బమ్మ. ఆ ఇల్లు కూడా నిశ్శబ్దంగా రోదిస్తున్నట్లు వీడ్కోలు చెప్తున్నట్లు అనిపించి కన్నీటి సంద్రమయింది ఆమె. అందరి హృదయాలూ భారమయ్యాయి. కారు కదిలింది. ఎయిర్ పోర్టుకు అర్థగంట ప్రయాణం.

ఎడారిదారుల్లో ప్రయాణం సాగింది. ఆమె ఎడబాటుకు సహించలేక శోకిస్తున్నట్లు ఎడారి ఇసుక తెరలుగా పైకిలేస్తోంది. ఎడారి అయినా ఇంతకాలం తల్లిలా కడుపులో దాచుకుంది. కష్టసుఖాల్లో తోడుగా నిలిచింది. ఎదురుగా వున్న ఎడారిని చూస్తూ సెలవు అంటూ చేతులెత్తి నమస్కరించింది సుబ్బమ్మ.

ఇంతలో ఇంటి వద్దనుండి కొడుకులు బయలుదేరావా అంటూ ఫోన్ చేసారు. దు:ఖం అడ్డుపడటంతో మాట్లాడలేకపోయింది. 'ఆ వస్తున్నాను' అని పొడిగా సమాధానం చెప్పింది.

ఆ క్షణాన ఆ కొడుకులే లేకపోతే, కడుపున పుట్టకపోతే ఇక్కడే ఈ బిడ్డ హసన్ తో హాయిగా వుండేదాన్ని కదా అనిపించింది ఆమెకు. కడుపున పుట్టకపోయినా హసన్ పై వున్న ప్రేమ అలాంటిది. పెంచిన ప్రేమ ఎంత గొప్పది.

కువైట్ ను, వీళ్ళందరినీ జన్మలో మరలా చూడగలదా? రావాలనుకున్నా ఆరోగ్యం సహకరిస్తుందా?

దారిలో అటు అరేబియా సముద్రపు అలల హోరు. ఇటు బుర్రలో ఆలోచనల జోరు. పోనీ ఇక్కడే వుండిపోతే..

అక్కడ పిల్లలు, ఊరు, గాలి, నేల, నేస్తాలు. తల్లి మనసు అటు ఇటు లాగుతోంది.

ఆమె మానసిక స్థితిని గమనించిన హసన్ కూడా ఆలోచిస్తూ మౌనంగా కారు నడపసాగాడు. కుమిలిపోతూ కారులో కూర్చుంది సుబ్బమ్మ. గుండె బరువెక్కినట్లనిపించింది.

"నాయనా హసన్ అని పిలిచింది. నోట్లో నుండి మాట రాలేదు." తల వాలిపోయింది.

ఆమె పరిస్థితి గమనించి కారాపాడు హసన్. మొహంపై నీళ్ళు చిలకరించి ఒడిలో పడుకోపెట్టుకున్నాడు. హసన్ ను చూస్తూ ప్రాణం వదిలేసింది సుబ్బమ్మ.

ఘొల్లుమన్నాడు హసన్. అతడి దు:ఖానికి అవధులు లేవు. హాస్పిటల్ కు తీసుకెళితే అప్పటికే ప్రాణం పోయింది అన్నారు.

అన్నేళ్ళు కాలం గడిపిన ఆ గాల్లోనే శ్వాసను వదిలేసింది సుబ్బమ్మ. అందరికీ విషయం తెలిసింది. ఇండియాలో కూడా సుబ్బమ్మ పిల్లలు శోకసంద్రంలో మునిగారు.

ఇక జరగవలిసిన కార్యక్రమాన్ని గుర్తు చేసుకుని సుబ్బమ్మ కోరిక ప్రకారం భౌతికకాయం ఆ మట్టిలో కలవాలనే ఉద్దేశంతో విమానంలో ఆమె దేహాన్ని ఇండియాకు పంపించాడు హసన్.

అందరూ ఎప్పుడో ఒకసారి పోవాల్సినవాళ్ళమే అని తెలిసినా కొంతకాలం పాటూ హసన్ తేరుకోలేకపోయాడు.

అతడిని ఓదార్చడం కష్టమయింది.

అతడి దు:ఖాన్ని చూసి ఎడారి కూడా వెక్కివెక్కి ఏడ్చింది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments